# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయం, మౌలిక సదుపాయాలకు సంబంధించి కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది.
- ❖ భారత్, జమైకాల మధ్య భాగస్వామ్యంలో అభివృద్ధి సహకారం కీలక అంశమని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.
- ❖ సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సూత్రం కింద సమ్మిళిత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని కేంద్రమంత్రి జె.పి. నడ్డా ఉద్ఘాటించారు.
- ❖ దేశంలో బలమైన పరిశోధన, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సాంకేతికతలపై దృష్టి సారిస్తూ. 1.52 లక్షల కోట్ల రూపాయల విలువైన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. వీటిలో ప్రధానంగా గుజరాత్‌లో 1,570 కోట్ల రూపాయల విలువైన నౌకా మరమ్మతు కేంద్రం, చెరకు ధరలో గణనీయమైన ప్రయోజనాలు, పత్తి ఉత్పాదకతను పెంచడం వంటి అంశాలు ఉన్నాయి. కేబినెట్ సమావేశ వివరాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడిస్తూ.. పత్తి రంగంలోని సమస్యలను పరిష్కరించడానికి 5 వేల 659 కోట్ల రూపాయల కేటాయింపుతో "కపాస్ క్రాంతి" పేరుతో పత్తి ఉత్పాదకత మిషన్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ పథకం ద్వారా సుమారు 32 లక్షల మంది పత్తి రైతులు లబ్ధి పొందుతారని, 2030-31 నాటికి పత్తి ఉత్పత్తి 498 లక్షల బేళ్లకు పెరుగుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, జమైకాల మధ్య భాగస్వామ్యంలో అభివృద్ధి సహకారం కీలకమైన అంశమని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. జమైకా విదేశాంగ మంత్రి కొమినా జాన్సన్ స్మిత్, ఇతర క్యాబినెట్ సభ్యులతో ఈరోజు సమావేశమైన అనంతరం ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ చర్చలు ద్వైపాక్షిక సంబంధాలలోని అన్ని అంశాలకు సంబంధించి జరిగాయని చెప్పారు. సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి గల నూతన మార్గాలను గుర్తించాయని అన్నారు. డిజిటల్ పరివర్తన, సాంస్కృతిక మార్పిడి, క్రీడలు, డిజిటల్ చెల్లింపులు వంటి రంగాలలో ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందాల అమలుపై ఇరు దేశాలు చర్చించాయన్నారు. అలాగే పలు ముఖ్యమైన ఒప్పందాలపై రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. అనే సూత్రం కింద సమ్మిళిత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డా ఉద్ఘాటించారు. ఆరోగ్య సంరక్షణపై భారత్, జపాన్ దేశాల 3వ సంయుక్త కమిటీ న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన సమావేశానికి జె.పి. నడ్డా, జపాన్ ఆరోగ్య సంరక్షణ విధాన శాఖ మంత్రి కిమీ ఒనోడాలు సహ-అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఆరోగ్య రంగంలో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి, కొత్త భాగస్వామ్యాలను ప్రోత్సహించడానికి ఇరు దేశాలు నిబద్ధతతో ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఈ సమావేశం ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని జె.పి. నడ్డా స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాం అధ్యక్షుడు టో లామ్ భారత్‌లో అధికారిక పర్యటన నిమిత్తం ఈరోజు న్యూఢిల్లీకి చేరుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఆయనకు స్వాగతం పలికారు. అంతకుముందు టో లామ్.. బీహార్‌లోని బోధ్ గయను సందర్శించి, మహాబోధి ఆలయంలో ప్రార్థనలు నిర్వహించారు. వియత్నాం మఠాన్ని కూడా సందర్శించి.. మత, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా టో లామ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు జరుపుతారు. అదే విధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కూడా ఆయన సమావేశమవుతారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

యూఏఈ లోని ఫుజైరా పెట్రోలియం ఇండస్ట్రీస్ జోన్‌పై జరిగిన డ్రోన్ దాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఇరాన్ నిన్న జరిపిన డ్రోన్ దాడిలో యూఏఈ లోని ఫుజైరా పెట్రోలియం ఇండస్ట్రీస్ జోన్ లో అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు భారత పౌరులు గాయపడ్డారు. ఈ దాడిపై ప్రధానమంత్రి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. పౌరులను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. యూఏఈకి భారత్.. బలంగా సంఘీభావం తెలుపుతుందని, చర్చలు, దౌత్యం ద్వారా అన్ని సమస్యల శాంతియుత పరిష్కారానికి మద్దతునిస్తుందని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆవిష్కరణల ఆధారిత ఫలితాలను అందించేందుకు దేశ పరిశోధన పర్యావరణ వ్యవస్థను మార్చవలసి ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఐఐటి మద్రాస్ టెక్ సమ్మిట్‌లో

ఆయన మాట్లాడుతూ.. దేశంలో బలమైన పరిశోధన, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పరిశోధనల ఫలితాలు థీసిస్‌ల ప్రచురణలకే పరిమితం కాకూడదని, సమాజానికి ప్రయోజనం చేకూర్చే ఆవిష్కరణలకు దోహదపడాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ కార్యక్రమాల ద్వారా పరిశ్రమలు, అంకుర సంస్థలు, విద్యా సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు కేటాయించిందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో... ఆ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజైన ఈ నెల 9న కొత్త మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. కాగా.. కేరళంలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 102 స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్.. శాసనసభ పక్ష సమావేశం అనంతరం మంత్రివర్గ ఏర్పాటు కోసం గవర్నర్‌ను సంప్రదించనుంది. ఢిల్లీ నుంచి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు వచ్చిన తర్వాతే శాసనసభ పక్ష సమావేశం జరుగుతుందని యూడీఎఫ్ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఐదు గ్రౌండ్-బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ కొనుగోలుకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియన్-ఇండిజినస్లీ డిజైన్డ్, డెవలప్డ్ అండ్ మాన్యుఫ్యాక్చర్డ్ విభాగం కింద న్యూఢిల్లీలో ఈరోజు రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో 1,400 కోట్ల రూపాయల ఒప్పందంపై సంతకాలు చేసినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. కనీసం 72 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారయ్యే ఈ వ్యవస్థ.. భారత సైనిక విభాగాలను ఆధునీకరించడంతో పాటు, దేశీయ రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి.. జపాన్ ప్రతినిధుల సభ సభ్యుడు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ఛైర్‌పర్సన్ తకాయుకి కొబయాషీతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. భారత్-జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సురక్షితమైన, సుస్థిరమైన ఇంధన భవిష్యత్ కోసం సహకారాన్ని పెంపొందించడం, నౌకా నిర్మాణ రంగంలో సహకారానికి కొత్త మార్గాలను అన్వేషించడం వంటి అంశాలపై చర్చలు జరిపినట్టు కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =